క్లుప్తంగా

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పిస్తున్న ఆర్ఎం

కడప కల్చరల్ : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్బీఐ రీజినల్ మేనేజర్ ఇఏ శ్రీవాణి కిషోర్ కుమార్‌రెడ్డి సూచించారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, బాధితులు డబ్బు పోగొట్టుకున్నాక తిరిగి తెచ్చుకోవడం కష్టమవుతోందని తెలిపారు. మంగళవారం స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా అనాథ శరణాలయ ప్రాంగణంలో ఖాతాదారుల సేవలు మెరుగుపరుచడం, సైబర్ క్రైమ్ గురించి అవగాహన పెంచడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం సైబర్ క్రైమ్ కడప బ్రాంచ్ అధికారులు, ఖాతాదారుల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాసాపేటలో గుడి నిర్మాణం కొరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో ఓపెన్ డిఫికేషన్ ప్రాంతాన్ని పరిశీలించి, వెంటనే శుభ్రం చేయాలని సూచించా. అక్కడ నిర్మించిన గోడను తక్షణమే తొలగించి, డోజర్ సాయంతో శుభ్రం చేయాలన్నారు. మారెమ్మ గుడి సమీపంలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అగాడిలో నూతనంగా నిర్మించిన డ్రైన్ పనులను పరిశీలించి, నాణ్యతగా చేయాలని ఆదేశించారు. కేసీ కెనాల్‌లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. కన్వెన్షన్ హాలు ఎదురుగా ఉన్న పార్కులో ఫెన్సింగ్ వేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్, ఏఈ అంజలి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్

వైవీయూ : జీవశాస్త్ర ఉపాధ్యాయులు పరిశోధన దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. మంగళవారం కళాశాల సెమినార్ హాల్‌లో జిల్లాలోని వివిధ మేనేజ్‌మెంట్ పరిధిలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవీయ విలువలతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. డీబీటీ స్టార్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వై. సావిత్రి మాట్లాడుతూ విద్యార్థిదశలోనే పరిశోధనల పట్ల ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా ఎం. రమేష్, ఏపీ బయోలాజికల్ సైన్స్ ఫోరం కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు డా. కల్పన, డా. పి. రవిశేఖర్, డా. రామచంద్ర, డా. నాగేంద్ర, మహేష్ అపర్ణ, బయాలజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు బీమా నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: పంట సాగు చేసిన ప్రతి రైతు పంటల బీమా నమోదు తప్పకుండా చేయించుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడప మండలం చెమ్మియాపేటలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం కింద బ్యాంకులో లోన్ తీసుకోవడం ద్వారా, నాన్ లోన్ రైతులు అయినట్లయితే కామన్ సర్వీసు సెంటర్ నందు ఫసల్ భీమ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందులో శనగపంటకు ఎకరాకు రూ. 480, మినుముకు ఎకరాకు రూ. 285, పెసరకు ఎకరాలకు రూ. 270 ఇలా ఒక్కో పంటకు ఒక రకంగా పంటల బీమాను చెల్లించాలని తెలిపారు. ఈ పంటల బీమాను డిసెంబర్ 31వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మోహరాజ్, పావని, రైతులు పాల్గొన్నారు.

బస్టాండులోకి వెళ్లేదెలా..?

- కడప ఆర్టీసీ బస్టాండులో లోపించిన పారిశుద్ధ్యం
- పరిసరాలు అస్తవ్యస్తం
- ప్రయాణీకులకు తప్పని తిప్పలు



ఆర్టీసీ బస్టాండు ప్రవేశ ద్వారం వద్ద నిలబడిన మురికి నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండులో ప్రతిరోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లాతో పాటు మన రాష్ట్రం, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు లాంటి రాష్ట్రాల నుంచి ప్రతిరోజు బస్సులు ప్రయాణీకులను చేరవేస్తుంటాయి. అలాంటి బస్టాండు ప్రాంతం తీవ్ర అసౌకర్యంగా మారింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రవాణాశాఖ మంత్రిగా ఉంటున్నా కడప బస్టాండులో ఇలాంటి దుస్థితి నెలకొనడంలో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండులోకి వెళ్లేందుకు ఇబ్బందులు

గత కొన్నిరోజులుగా ఆర్టీసీ బస్టాండు ఇన్‌గేట్ ప్రాంతంలోని ప్రధాన కాలువ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. డ్రైనేజీ నీటితోపాటు వర్షపు నీరు రోడ్డుపై నిలబడకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. ఈ కారణంగా బస్టాండులోకి ఇన్‌గేట్ ద్వారా బస్సులు, ప్రయాణీకులకు వీలు లేకుండా పోయింది. మరోవైపు చిన్నపాటి వర్షానికే బస్టాండు ప్లాట్‌ఫారాల వద్ద రోజుల తరబడి నీరు నిలబడి ఉంటుంది. ఇంకో వైపు బస్టాండు లోపలి భాగంలో ప్రవేశ ద్వారం వద్ద డ్రైనేజీ నీరు నిలబడి ఉండడంతో ప్రయాణీకుల కష్టాలు వర్ణణాతీతంగా ఉంది. బస్సులు నిలబడే ప్రాంతంలో భూమిలో పెద్ద ఎత్తున పగుళ్లు ఏర్పడడంతో నడిచేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు

అడుగడుగునా అపరిశుభ్రత నెలకొనడంతో బస్టాండు పరిసరాలు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. అయినప్పటికీ ప్రయాణీకులు తప్పనిసరి పరిస్థితుల్లోనే మురికి నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మరోవైపు ఆర్టీసీ బస్టాండు గ్యారేజీ వద్ద బురద మయం కావడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, కార్పొరేషన్ అధికారులు డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు బస్టాండు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్లాట్‌ఫారాల వద్ద వర్షపు నీరు నిలబడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండులోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు



ఆర్టీసీ బస్టాండులోనికి ఏవైపు నుంచి వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రధానంగా నాలుగు చినుకులు పడితే బస్టాండు పరిసరాలు చెరువును తలపిస్తున్నాయి. ఆర్టీసీ, కార్పొరేషన్ అధికారులు స్పందించి సత్వరమే తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

- సుబ్బారావు, ప్రకాశ్‌నగర్, కడప

బస్టాండు పరిసరాలు అపరిశుభ్రత



బస్టాండు చుట్టూ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. డ్రైనేజీ నీటి కారణంగా ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. మురికి నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో బస్టాండులోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్టాండు అవుట్ గేట్‌నుంచిబయటికి రావాలంటే నీరు ఎటూ పోకుండా నిలబడి ఉండడంతో ఎక్కడ కిందపడతామోనన్నభయం వెంటాడుతోంది.

- అశోక్, సామాజిక కార్యకర్త, కడప

సమస్యను పరిష్కరించేందుకు కృషి



ఆర్టీసీ ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమవంతుగా అన్ని చర్యలు చేపడుతున్నాం. డ్రైనేజీ మరమ్మతు పనుల కారణంగా బస్టాండు ఆవరణలోకి వస్తున్న వర్షపు, మురికి నీటిని కార్పొరేషన్ అధికారులతో సంప్రదించి ఎప్పటికప్పుడు తరలిస్తున్నాం. ప్రయాణీలకు అసౌకర్యం కలగకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- పాలిమేర గోపాల్‌రెడ్డి, రీజనల్ మేనేజర్, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

శరణమయా.. శబరిగిరీశా!



అయ్యప్ప మండల దీక్ష పూజలో పాల్గొన్న అఖిల భారత అయ్యప్ప అధ్యక్షుడు రాజు దేశ పాండే

కడప కల్చరల్ : శరణమంటిమయా.. శబరి గిరీషా అంటూ అయ్యప్పస్వామిని భక్తులు శరణు కోరారు. స్వామి కరుణ కోసం వచ్చిన భక్తజన సందోహంతో ఆ ప్రాంతం నిండిపోయింది. ఆ పరిసరాలు భక్తిభావంతో ఓలలాడాయి. శబరిగిరీశుని వైభవాన్ని తిలకించిన భక్తుల హృదయాలు ఆనందంతో ఓలలాడాయి. అందరూ భేషజాలను దూరం పెట్టి గొంతెత్తి మైమరిచి అయ్యప్పను స్తుతిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం శ్రీ అయ్యప్పస్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కనుల పండువగా అలంకరించారు. వేదిక మధ్యలో 18 మెట్లపై అభయముద్రలో ఉన్న అయ్యప్పస్వామిని, ఇరువైపుల శ్రీలక్ష్మీమాత, శ్రీగణపతిలను కొలువుదీర్చారు. 18 మెట్లపై దీపాలను, ఫలపుష్పాలను అలంకరించారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలకు హాజరైన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. అడుగడుగునా స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు చేసిన శరణుఘోషతో ఆ ప్రాంగణం ప్రతిధ్వనించింది. పూజలనంతరం భక్తులందరికీ నిర్వాహకులు భిక్షను ఏర్పాటు చేశారు.

నేడు గ్రామోత్సవం

బుధవారం అయ్యప్పస్వామికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.00 గంటలకుకలశపూజ చేసిన అనంతరం భక్తులు స్వామినిఅలంకరించిన రథంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. హౌసింగ్ బోర్డుతో పాటు ఎర్రముక్కపల్లె మీదుగా గ్రామోత్సవం తిరిగి ఆలయానికి చేరుతుంది.

విజయదుర్గ.. కాపాడు తల్లీ!



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కడప కల్చరల్ : విజయదుర్గమ్మ కాపాడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి మొరపెట్టుకున్నారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం చివరి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఈ పూజలకు హాజరయ్యారు.

రాజ్యాంగమే మనకు శిరోధార్యం



కడప ఎడ్యుకేషన్: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ ఈఓ, హెచ్ఎంలు



కడప అర్బన్: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కడప బార్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు



వైవీయూ/ఏఎఫ్‌యూ: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సూర్య చారిటబుల్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: రాజ్యాంగమే మనకు శిరోధార్యమని కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని గీతం విద్యాసంస్థలలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణా కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి ఆమోదముద్రపడి 75 వసంతాలు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి బలం భారత రాజ్యాంగమేనని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ వీరేంద్ర , మాస్టర్ ఫెసిలిటేటర్స్ గా ఉన్న ప్రిన్సిపాల్స్ డాక్టర్ అనిత, డాక్టర్ సిఎస్ ప్రసాద్, సుందర్ రాజు, ఎంఈఓ రఫిక్ జాన్, అసిస్టెంట్ ఏఎంఓ రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ సిఎంఓ దశరథరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కడప కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాల లేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉందన్నారు.

రాజ్యాంగం ద్వారానే సకల హక్కులు

డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే సకల హక్కులు కల్పించబడుతున్నాయని డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఈఓ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

అంధుల ఉన్నత పాఠశాలలో..

కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎబినైజర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు నరసింహులు, మురళీ, శ్రీను, రాజ, నవీన్, కరీముల్లా, కుమారస్వామి, సరస్వతి పాల్గొన్నారు.

రాజ్యాంగం గురించి తెలుసుకోవాలి

భారత రాజ్యాంగం గురించి ప్రతి విద్యార్థి తప్పకుండా తెలుసుకోవాలని సూర్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రభాకర్, వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు శివహరి ప్రసాద్‌రెడ్డి, దక్షణామూర్తి, వెంకటామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి పాల్గొన్నారు.

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో..

భారతదేశంలోని ప్రతి పౌరునికి సమానత్వ, స్వేచ్ఛ కలిగించేదే భారత రాజ్యాంగం అని రాజంపేట ప్రత్యేక జుడీషియల్ మేజిస్ట్రేట్ డా. పి. శంకర్ పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కడప నగర శివారులలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల నందు "జాతీయ రాజ్యాంగ దినోత్సవ" కార్యక్రమాన్ని స్టెప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక జుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్ మాట్లాడుతూ భారత దేశములోని ప్రతి పౌరునికి భారత కళాశాల స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, సిబ్బంది నాగయ్య, విద్యార్థులు పాల్గొనారు.

బహుమతులు ప్రదానం

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలసీమ పరిధిలోని 8 జిల్లాలకు సంబంధించి అన్ని యాజమాన్య పరిధిలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డిబేట్, దేశభక్తి గేతాల విభాగాలకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ప్రసంశ పత్రాలను విద్యార్థులకు మంగళవారం డీఈఓ మీనాక్షి ప్రదానం చేశారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ 75వ దినోత్సవం సందర్భంగా మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పూలమాల వేసి నివాళి అర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునెయ్య, గోవిందు యేసురత్నం, భాగ్యలక్ష్మి, వెంకటరమణ పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్‌సీపీ ఆధ్వర్యంలో..

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే సకల హక్కులు కల్పించబడుతున్నాయని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఆర్‌సీపీ నగర కమిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, కలెక్టరేట్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బుల్ బాషా, కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, తస్లీమ్, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఏపీ దళిత మిత్ర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రామాంజనేయులు, బండెల ఓబయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మనోహర్, మురహరి ప్రవీణ్‌కుమార్, పాస్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

కడప రూరల్ : రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. రాజ్యాంగ అమలు దినోత్సవ సందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం నిర్వహించారు.

రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

కడప అర్బన్ : భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్పనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడపలోని జిల్లా కోర్టులో న్యాయవాదుల సంఘం భవనంలో బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

వైవీయూ/ఏఎఫ్‌యూ : కడప నగరంలోని విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగం ఆమోదించిన రోజును పురస్కరించుకుని 'సంవిధాన్ దివస్' నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వైవీయూలో నిర్వహించిన కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.జి.దాము, మేనేజిమెంట్, ఆర్ట్స్ విభాగ డీన్లు ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య గంగయ్య, ఆచార్య అనిత తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలకంటే భారత దేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన డా. బి.ఆర్. అంబేద్కర్ గొప్ప దార్శనికులు కొనియాడారు.

సెమినార్

సంవిధాన్ దివస్ ను పురస్కరించుకుని 'హ్యాపీ కాన్స్టిట్యూషన్ డే' పేరుతో సెమినార్ ను వైవీయూ పొలిటికల్ సైన్సు అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో సురభి సమావేశ మందిరంలో నిర్వహించారు. న్యూఢిల్లీ వి.ఐ.పి.ఎస్. స్కూల్ ఆఫ్ లా అండ్ లీగల్ స్టడీస్ చైర్ పర్సన్ ఆచార్య టి.వి.సుబ్బారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం చదివితే బాధ్యతగల పౌరులుగా తయారువుతారని చెప్పారు. అధ్యాపకులుతదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో..

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు రాజేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఉదయప్రకాష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మానవత సంస్థ డైరెక్టర్ రాటాల గోపీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి, డా. గురుమోహన్‌రెడ్డి, వీరభద్రయ్య, వెంకటసుబ్బారెడ్డి, విజయలక్ష్మి, శచీదేవి, స్వరూప పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

ప్రభుత్వ పురుషుల కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం విశిష్టత గురించి వివరించారు.

బడుగులకు రాజ్యాంగమే అండ

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారత రాజ్యాంగం ఒక దిక్సూచి అని, అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందని సోనియా నర్సింగ్ కళాశాల చైర్మన్ శివప్రసాద్, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ లోకేష్, జిల్లా సలహాదారు పాస్టర్ పి.మహేష్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోనియా నర్సింగ్ కళాశాలలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలుజరిగాయి.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం



ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర విమర్శించారు. మంగళవారం కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక, రైతు సంఘాలు నగరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర పెట్టుబడిపై 50 శాతం అదనంగా నిర్ణయించి చట్టం చేయాలని, ఏ రంగంలో పని చేసే కార్మికుడికైనా జాతీయ కనీస వేతనాన్ని రూ. 26వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. 60 ఏళ్లు పనిచేసి రిటైర్ అయిన వారికి రూ.10 వేలు కనీస పెన్షన్ చెల్లించాలని కోరారు. ఆటో, హమాలీ, ట్రాన్స్ పోర్ట్, భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలను అమలు చేయాలని, స్కీం వర్కర్లయిన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు అన్నిటిని రద్దు చేయాలని. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపేయాలని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

అన్నదానం

కడప కల్చరల్ : స్థానిక పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక దివ్యాంగులకు పునరావాస కేంద్రంలో దాతలు మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జూటురు విజయ్ కుమార్ మాట్లాడుతూ షిఫా మానసిక వికలాంగుల పునరవాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కువైట్‌లోని ధనమ్మ, మనోజ్‌లు అన్నదానానికి సహకరించారన్నారు. కార్యక్రమంలో అల్-షిఫా మానసిక వికలాంగుల పునరవాస కేంద్రం చైర్మన్ అల్-షిఫా మహమ్మద్, శిరీష పాల్గొన్నారు.

రైతు, కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టాలి

కడప కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట 'కార్మిక కర్షక దేశవ్యాప్త నిరసన దినానికి మద్దతుగా' యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్షకులకు 150 శాతం కనీస మద్దతు ధర, కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం, 10వేల కనీస పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ యూనియన్ నేతలు అక్బర్, సుధీకర్, వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, పర్వీన్, వసుప్రద, కుమార్, లీలాలక్ష్మీ, పద్మజాలత, చిన్నయ్య, సాదక్ పాల్గొన్నారు.